RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -133 పేజీలు - 04 వెల - 04/- శుక్రవారం 19 జూన్ 2026

# 30,515 కోట్ల పెట్టుబడులకు ఆమోదం

## 'నాన్-సీరియస్ ప్లేయర్స్'కు ఏపీలో చోటులేదు: సీఎం చంద్రబాబు

రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో రూ. 30,515 కోట్ల పెట్టుబడులకు ఆమోదం

ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో సుమారు 30 వేల ఉద్యోగాలు రానున్నాయని అంచనా

ఇథనాల్, సెమీ కండక్టర్ల పరిశ్రమలను ప్రోత్సహించాలని అధికారులకు దిశానిర్దేశం

ప్రాజెక్టులు ప్రారంభించాకే ప్రోత్సాహకాలు ఇవ్వాలని మంత్రి లోకేశ్ స్పష్టీకరణ

**అమరావతి జూన్ 18ఆంధ్ర ప్రగతి**
పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు చేరేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన 18వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో **మిగతా 2లో...**






# శాంతి ఒప్పందంపై సంతకాలు





### ఫ్రాన్స్‌లో ట్రంప్-టెహ్రాన్‌లో పెజెష్కియాన్

### నేడు అధికారికంగా సంతకాల కార్యక్రమం

**జూన్ 18 ఆంధ్ర ప్రగతి**
మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని ముగించేందుకు ఉద్దేశించిన శాంతి ఒప్పందంపై అమెరికా, ఇరాన్ అధ్యక్షులు సంతకాలు చేశారు. దీంతో ఒప్పందం తక్షణమే అమలులోకి వచ్చింది. ఈ ఒప్పందం ప్రకారం హోర్ముజ్ జలసంధిని ఇరాన్ తెరుస్తుంది. అదే విధంగా ఇరాన్ ఓడరేవులపై విధించిన దిగ్బంధాన్ని అమెరికా ఎత్తివేస్తుంది. ఇరాన్ పునర్నిర్మాణానికి 300 బిలియన్ డాలర్ల ఆర్థిక సాయం అందుతుంది. ఇరాన్‌పై విధించిన అన్ని రకాల ఆంక్షలను **మిగతా 2లో...**

# తిరుపతికి మరో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ..



మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఎంవోయూ

తిరుపతిలో జేఎస్ఎస్ మహావిద్యాపీఠం ఆఫ్-క్యాంపస్ ఏర్పాటు

మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం

74 కోర్సులతో 10 వేల మందికి పైగా విద్యార్థులకు ఉన్నత విద్య

ప్రాజెక్టు ద్వారా 20 వేలకు పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన

ప్రతిష్ఠాత్మక నాక్ ఏ++ గుర్తింపు పొందిన జేఎస్ఎస్ విద్యాసంస్థ

**అమరావతి జూన్ 18ఆంధ్ర ప్రగతి**
ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా కొలువుదీరిన ప్రజాప్రభుత్వంలో విద్యా రంగం అభివృద్ధికి కీలక అడుగు పడింది. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతికి మరో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ రానుంది. మైసూరు కేంద్రంగా పనిచేస్తున్న జగద్గురు శ్రీ శివరాత్రీశ్వర (జేఎస్ఎస్) మహావిద్యాపీఠం, తమ ఆఫ్-క్యాంపస్‌ను తిరుపతిలో ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో అమరావతిలో ఏపీ ఉన్నత విద్యామండలి, జేఎస్ఎస్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయూ) జరిగింది.
ఈ ఒప్పంద పత్రాలపై ఏపీ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, జేఎస్ఎస్ మహావిద్యాపీఠం టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, జేఎస్ఎస్ ఏహెచ్ఈఆర్ ప్రో ఛాన్సలర్ డా.బి.సురేష్ సంతకాలు చేసి మార్చుకున్నారు. **మిగతా 2లో...**

# అనాథ పిల్లలకూ తల్లికి వందనం

మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు

చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచన

**అమరావతి జూన్ 18ఆంధ్ర ప్రగతి**
రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుడుతూ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ కోసం కేంద్ర**మిగతా 2లో...**



# విజయవాడ కస్టడీ డెత్ కేసుపై సీబీఐ విచారణకు జగన్ డిమాండ్

మే 9 నుంచి అదృశ్యమైన యువకుడు సాయికృష్ణ

బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వ తీరుపై విమర్శలు

**విజయవాడ జూన్ 18 ఆంధ్ర ప్రగతి**
కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో 25 ఏళ్ల గాదె సాయికృష్ణ అనుమానాస్పద మృతిపై సీబీఐ విచారణ జరిపించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సాయికృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటనను కప్పిపుచ్చేందుకు విజయవాడ పోలీస్ కమిషనర్, డీజీపీ స్థాయి అధికారులు ప్రయత్నిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు.**మిగతా 2లో...**





# జూన్ 30న రైతు భరోసా

కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన ఉత్తమ్

7 రకాల సన్న వడ్లకు బోనస్ ఇవ్వనున్నట్లు వెల్లడి

నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్న మంత్రి

**హైదరాబాద్ జూన్ 18ఆంధ్ర ప్రగతి**
తెలంగాణ సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈరోజు జరిగిన కీలక కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ భేటీ వివరాలను భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు."వానాకాలం రైతు భరోసా నిధులను విడుదల చేయాలని కేబినెట్ నిర్ణయించింది.**మిగతా 2లో...**

# లిక్కర్ స్కామ్ కేసులో కారుమూరి సునీల్ అరెస్ట్

మాజీ మంత్రి కారుమూరి కుమారుడికి 14 రోజుల రిమాండ్

సునీల్‌ను అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించిన ఈడీ

రూ.28 కోట్ల కిక్‌బ్యాకులు పొందినట్లు ఈడీ ఆరోపణ

ఈ స్కామ్ వల్ల ప్రభుత్వానికి రూ.195 కోట్ల నష్టం వాటిల్లినట్టు అంచనా



**హైదరాబాద్ జూన్ 18 ఆంధ్ర ప్రగతి**
గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం రవాణా కుంభకోణం కేసులో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు కారుమూరి సునీల్ కుమార్‌కు హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల అనంతరం అధికారులు ఆయన్ను చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించారు. జూన్ 18న సునీల్ నివాసం, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించిన అనంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఆయన్ను అరెస్ట్ చేశారు.**మిగతా 2లో...**

# గ్రీనింగ్ సొసైటీ ఏర్పాటు చేయండి

- జులై 3నాటికి ప్రక్రియ పూర్తి కావాలి

- ప్రతి గ్రామ పంచాయతీలో నర్సరీ ఉండాల్సిందే

-సీడ్ బాల్స్ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంలా మార్చండి

-అటవీ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష

ఉప ముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్



**అమరావతి జూన్ 18 ఆంధ్ర ప్రగతి**
రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా ప్రతిపాదించిన 'గ్రీనింగ్ సొసైటీ' ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఆదేశించారు. జులై 3వ తేదీ నాటికి ఈ సొసైటీ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ పూర్తి కావాలని స్పష్టం చేశారు.**మిగతా 2లో...**

# పెట్రో ధరల తగ్గింపుపై ఆశలు..

## ఇప్పుడే కుదరదంటున్న కేంద్రం!

తగ్గిన పశ్చిమాసియా ఉద్రిక్తతలు

దీంతో దిగొచ్చిన ముడి చమురు ధరలు


రిటైల్ ధరలూ తగ్గుతాయని ప్రజల ఆశాభావం

వెంటనే సాధ్యం కాదన్న సురేశ్ గోపీ

ముడి చమురు సరఫరాలో ఇంకా ఇబ్బందులు

అవి సద్దుమణిగాకే ధరల్లో సవరణకు అవకాశం

**ఢిల్లీ జూన్ 18ఆంధ్ర ప్రగతి**
అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గినంత మాత్రాన దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గవని కేంద్ర పెట్రోలియం, సహజవాయు శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ స్పష్టం చేశారు.**మిగతా 2లో...**



# టెలిగ్రామ్ ఒక కొత్త డార్క్ వెబ్.. సైబర్ క్రైమ్స్‌కు అడ్డా

: హైకోర్టుకు తెలిపిన కేంద్రం

నీట్ రీ-టెస్ట్ నేపథ్యంలో టెలిగ్రామ్‌పై తాత్కాలిక నిషేధం

నిషేధాన్ని సవాల్ చేస్తూ టెలిగ్రామ్ హైకోర్టులో పిటిషన్

**ఢిల్లీ జూన్ 18ఆంధ్ర ప్రగతి**
మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్ ఒక 'కొత్త డార్క్ వెబ్'గా రూపాంతరం చెందిందని, సైబర్ నేరగాళ్లు, ఉగ్రవాదులు, పరీక్షల అక్రమాలకు పాల్పడే ముఠాలకు ఇది అడ్డాగా మారిందని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ హైకోర్టుకు విన్నవించింది. నీట్-యూజీ 2026 రీ-టెస్ట్ **మిగతా 2లో...**



# జూన్ 30న రైతు భరోసా

**మొదటి పేజీ తరువాయి**

జూన్ 30వ తేదీన మధిరలో నిర్వహించబోయే 'రైతు సమ్మేళనం' బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను నేరుగా విడుదల చేస్తారు. మార్కెట్ డిమాండ్ మేరకు 7 రకాల సన్న వడ్లకు బోనస్ ఇవ్వాలని కూడా కేబినెట్ నిర్ణయించింది" అని తెలిపారు.తెలంగాణ నుండి కేంద్రం తక్కువ ధాన్యం సేకరించడం సరికాదని అన్నారు.. ఎరువుల కోటా, రామగుండం యూరియాలో రాష్ట్రానికి సింహభాగం కేటాయింపు, హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 అనుమతులు, ఐఆర్ఎఫ్ సీ రుణాల విడుదలపై త్వరలోనే మంత్రుల బృందం ఢిల్లీ వెళ్లనుందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి కోసం బీజేపీ ఎంపీలు కూడా కలిసి రావాలని పిలుపునిచ్చారు. జూన్ 21న జరిగే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కేబినెట్ నిర్ణయించిందని చెప్పారు. ఇకపై అంతా డిజిటల్ కేబినెట్ నిర్వహిస్తామన్నారు.

# పెట్రో ధరల తగ్గింపుపై ఆశలు..

**మొదటి పేజీ తరువాయి**

ఇంధన ధరల నిర్ణయంలో ముడిచమురు ధరలతో పాటు రవాణా, సరఫరా, మార్కెట్ పరిస్థితుల వంటి అంశాలు ప్రభావం చూపుతాయని తెలిపారు.తక్కువ ధరకు కొనుగోలు చేసిన ముడిచమురు భారత్‌కు చేరేందుకు సమయం పడుతుందని సురేశ్ గోపీ చెప్పారు. ముఖ్యంగా హర్మూజ్ జలసంధి మార్గంలో నౌకల రద్దీ ఎక్కువగా ఉండటంతో సరఫరా ప్రక్రియ సాధారణ స్థితికి రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల అంతర్జాతీయ ధరలు తగ్గిన వెంటనే దేశీయ ఇంధన ధరలను తగ్గించడం సాధ్యం కాదన్నారు.పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఇటీవల గ్లోబల్ ఇంధన మార్కెట్లలో తీవ్ర ఒడుదొడుకులు చోటుచేసుకున్నాయని మంత్రి తెలిపారు. ముడిచమురు ధరల పెరుగుదల ప్రభావం పూర్తిగా వినియోగదారులపై పడకుండా కేంద్ర ప్రభుత్వం గణనీయమైన భారం భరించిందన్నారు. ఈ ప్రక్రియలో ప్రభుత్వానికి రూ.12 వేల కోట్ల మేర నష్టం వాటిల్లిందని చెప్పారు.

ఇంధన ధరలు పెరిగిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వాలు తమ పన్నులను తగ్గించి ఆదాయాన్ని వదులుకోలేదని మంత్రి వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం, చమురు మార్కెటింగ్ సంస్థలు కూడా ఆర్థికంగా నిలదొక్కుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గే దిశగా దౌత్యపరమైన ప్రయత్నాలు ముందుకు సాగడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 78 డాలర్లకు చేరగా డబ్ల్యూటీఐ క్రూడ్ ధర 75 డాలర్ల స్థాయికి దిగివచ్చింది. అయితే ఈ తగ్గుదల ప్రభావం దేశీయ ఇంధన ధరలపై కనిపించాలంటే మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

# విజయవాడ కస్టడీ డెత్ కేసుపై సీబీఐ విచారణకు జగన్ డిమాండ్

**మొదటి పేజీ తరువాయి**

గతంలో నేరచరిత్ర ఉన్న సాయికృష్ణను మే 9వ తేదీన మార్కాపురంలో కృష్ణలంక పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, అప్పటి నుంచి అతని ఆచూకీ తెలియలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తన కుమారుడిని పోలీసులు అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలకు గురిచేశారని అతని తల్లి విజయలక్ష్మి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, తాము సాయికృష్ణను అదుపులోకి తీసుకోలేదని, అతని కోసం గాలిస్తున్నామని పోలీసులు కోర్టుకు విన్నవించారు.

ఈ కేసుపై విచారణ చేపట్టిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, పోలీసుల వాదనలపై సందేహాలు వ్యక్తం చేసింది. జూన్ 29లోగా సాయికృష్ణను కోర్టు ముందు హాజరుపరచాలని, లేనిపక్షంలో సంబంధిత అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించింది. ఈ పరిణామాల నేపథ్యంలో, ప్రభుత్వం కృష్ణలంక సీఐ నాగరాజును సస్పెండ్ చేసి, ఒక సీనియర్ ఐపీఎస్ అధికారితో ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై తక్షణమే హత్య కేసు నమోదు చేయాలని జగన్ డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వం ఈ విషయాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోందని ఆయన విమర్శించారు.

## టెలిగ్రామ్ ఒక కొత్త డార్క్ వెబ్.. సైబర్ క్రైమ్స్‌కు అడ్డా

**మొదటి పేజీ తరువాయి**

నేపథ్యంలో టెలిగ్రామ్‌పై విధించిన తాత్కాలిక నిషేధాన్ని సమర్థిస్తూ ప్రభుత్వం ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేసింది.జూన్ 21న జరగనున్న నీట్ రీ-టెస్ట్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. గత మే 3న జరిగిన నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. ఈ ఘటనపై సీబీఐ విచారణకు ఆదేశించడంతో పాటు, పరీక్షను రద్దు చేసి పునర్నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో, 'నీట్ మాఫియా' వంటి టెలిగ్రామ్ ఛానెళ్ల ద్వారా మళ్లీ అక్రమాలు జరగకుండా నిరోధించేందుకే జూన్ 22 వరకు ఈ తాత్కాలిక నిషేధం విధించినట్లు కేంద్రం స్పష్టం చేసింది.టెలిగ్రామ్‌లోని ప్రైవసీ ఫీచర్లను ఆసరాగా చేసుకుని నేరగాళ్లు తమ ఫోన్ నంబర్లు, ఐడీలను గోప్యంగా ఉంచుతూ సులభంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ప్రభుత్వం తన అఫిడవిట్‌లో ఆరోపించింది. చైల్డ్ పోర్నోగ్రఫీ, మాదకద్రవ్యాల సరఫరా, ఉగ్రవాద ప్రచారం, సైబర్ దాడులు, ఆర్థిక మోసాలు వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు టెలిగ్రామ్ వేదికగా మారిందని పేర్కొంది. మరోవైపు, ప్రభుత్వ నిర్ణయం భారతదేశంలోని సుమారు 150 మిలియన్ల వినియోగదారుల భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తోందని ఆరోపిస్తూ టెలిగ్రామ్ సంస్థ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. కొందరు నేరగాళ్ల చర్యల వల్ల వినియోగదారులందరినీ శిక్షించడం సరికాదని వాదించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, టెలిగ్రామ్‌కు ఎటువంటి తక్షణ ఊరట కల్పించలేదు. నీట్ పరీక్ష పవిత్రతను కాపాడేందుకే ఈ తాత్కాలిక చర్యలు తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం పునరుద్ఘాటించింది.

# అనాథ పిల్లలకూ తల్లికి వందనం

**మొదటి పేజీ తరువాయి**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంశ్రీ పథకం నిధుల వినియోగంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సుదీర్ఘ సమీక్షలో ఈ ఘనత సాధించిన అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంక్షేమం, అభ్యసన సామర్థ్యాల పెంపు, మౌలిక వసతుల కల్పనపై పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు.రాష్ట్రవ్యాప్తంగా కడప మోడల్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఈ ఏడాది 844 స్మార్ట్ కిచెన్ల నిర్మాణానికి తక్షణమే చర్యలు చేపట్టాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభమైన 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర' కిట్ల పంపిణీని మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (పీటీఎం) నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, రాష్ట్రంలోని 430 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) చదువుకుంటున్న 1,06,360 మంది విద్యార్థినులకు సౌకర్యవంతమైన వసతి కల్పించేందుకు 53,180 బంక్ బెడ్లను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఈ సదుపాయాన్ని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీలకు కూడా విస్తరించాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని 2,03,430 మంది విద్యార్థులకు కూడా కిట్లు పంపిణీ చేస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు.తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు సైతం ప్రభుత్వ పథకాల ఫలాలు అందాలన్న లక్ష్యంతో మంత్రి లోకేశ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. 'తల్లికి వందనం' పథకాన్ని అనాథ పిల్లలకు కూడా వర్తింపజేయాలని, ఇందుకోసం వారి గార్డియన్ల వివరాలను కచ్చితత్వంతో సేకరించాలని ఆదేశించారు. ఒకవేళ ఎవరూ లేని పక్షంలో, ఆ నిధులను నేరుగా జిల్లా కలెక్టర్‌కు పంపి, వారి ద్వారా పిల్లలకు చేరేలా చూడాలన్నారు. అంతేకాకుండా, అనాథ పిల్లల పేరుపై బ్యాంకు ఖాతాలు తెరిచి, పథకం నిధులను నేరుగా జమ చేయాలని సూచించారు. వారి చదువు పూర్తయ్యాక ఆ మొత్తాన్ని వారు స్వేచ్ఛగా వినియోగించుకునేలా ఒక శాశ్వత విధానాన్ని రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ఇది వారి భవిష్యత్తుకు బలమైన ఆర్థిక భరోసా ఇస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

## లిక్కర్ స్కామ్ కేసులో కారుమూరి సునీల్ అరెస్ట్

**మొదటి పేజీ తరువాయి**

తన తండ్రి పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఆ పలుకుబడిని ఉపయోగించి మద్యం రవాణా కాంట్రాక్టుల ద్వారా సునీల్ భారీగా లబ్ధి పొందారని, తద్వారా మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారని ఈడీ ఆరోపిస్తోంది.విచారణ సందర్భంగా, సుదర్శన్ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన సందీప్, ప్రతాప్ రెడ్డిలతో సంబంధం ఉన్న సంస్థలకు కాంట్రాక్టులు అప్పగించడంలో భారీ అవకతవకలు జరిగాయని ఈడీ తరపు న్యాయవాది కోర్టుకు వివరించారు. ఈ వ్యవహారంలో సునీల్ సుమారు రూ.28 కోట్ల మేర కిక్‌బ్యాకులు అందుకున్నారని, మరో రూ.7 కోట్ల విలువైన కుటుంబ లావాదేవీలను గుర్తించామని తెలిపారు. ఈ కుంభకోణం కారణంగా ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.195 కోట్ల నష్టం వాటిల్లిందని ఈడీ అభియోగాలు మోపింది.వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం రవాణా, పంపిణీ కాంట్రాక్టులలో చోటుచేసుకున్న అక్రమాలకు సంబంధించి ఈడీ గత కొంతకాలంగా దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో సునీల్ కుమార్ అరెస్ట్ ఒక కీలక పరిణామంగా మారింది. ప్రస్తుతం ఈ వ్యవహారానికి సంబంధించి తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

# తిరుపతికి మరో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ..

**మొదటి పేజీ తరువాయి**

70 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన జేఎస్ఎస్ విద్యాసంస్థకు భారత్‌తో పాటు విదేశాల్లో 300కు పైగా విద్యాసంస్థలు ఉన్నాయి. మైసూరు కేంద్రంగా ఉన్న జేఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (జీూా ూాఎజు=), నాక్ నుంచి ూా++ గుర్తింపు పొందిన డీమ్డ్ విశ్వవిద్యాలయం. ప్రతిష్ఠాత్మక ఎన్ఐఆర్ఎఫ్ 2025 ర్యాంకింగ్స్‌లో విశ్వవిద్యాలయాల విభాగంలో 21వ స్థానంలో, ఓవరాల్‌గా 38వ స్థానంలో నిలిచి తన నాణ్యతను చాటుకుంది.

**10 వేల మంది విద్యార్థులకు అవకాశం**

ప్రతిపాదిత తిరుపతి క్యాంపస్‌ను అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దనున్నారు. ఇందులో ఐదు సమగ్ర విద్యా పాఠశాలలను ఏర్పాటు చేస్తారు. అడ్వాన్స్‌డ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీస్, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ అండ్ బిహేవియరల్ సైన్సెస్, హెల్త్‌కేర్ అండ్ అలైడ్ సైన్సెస్, మేనేజ్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ టూరిజం, లా, హ్యూమానిటీస్, పాలసీ అండ్ గవర్నెన్స్ విభాగాల్లో మొత్తం 74 కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. క్యాంపస్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించాక, 10 వేల మందికి పైగా విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసించనున్నారు. వీటికి అదనంగా హెల్త్‌కేర్‌లో ఏఐ, సెమీకండక్టర్ అప్లికేషన్స్, హెల్త్ పాలసీ అండ్ గవర్నెన్స్, ఏరోస్పేస్ మెడిసిన్ వంటి ఆరు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కూడా నెలకొల్పనున్నారు.

**20 వేల ఉద్యోగాలు.. స్వర్ణాంధ్ర విజన్‌కు అనుగుణంగా..**

ఈ ఒప్పందం ప్రకారం, తిరుపతిలో క్యాంపస్ ఏర్పాటుకు అవసరమైన భూమి కేటాయింపు, చట్టబద్ధమైన అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం సింగిల్-విండో విధానాన్ని కల్పిస్తుంది. క్యాంపస్ నిర్మాణానికి అయ్యే మొత్తం వ్యయాన్ని జేఎస్ఎస్ మహావిద్యాపీఠమే భరిస్తుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేలకు పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. ఇది స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా రాష్ట్ర యువతకు గొప్ప అవకాశాలను అందిస్తుంది.

ఈ కార్యక్రమంలో జేఎస్ఎస్ ఏహెచ్ఈఆర్ రిజిస్ట్రార్ డా.బి.మంజునాథ, డీన్(రీసెర్చ్) డా. ప్రశాంత్ ఎమ్ విశ్వనాథ్, కేపీఎంపీ అడ్వైజరీ సర్వీసెస్ అసోసియేట్ డైరెక్టర్ ఎస్.రాఘవన్ తదితరులు పాల్గొన్నారు

# 30,515 కోట్ల పెట్టుబడులకు ఆమోదం

**మొదటి పేజీ తరువాయి**

రూ. 30,515 కోట్ల విలువైన 50 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. ఈ కంపెనీల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో 29,677 ఉద్యోగాలు రానున్నాయని అంచనా వేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, పరిశ్రమల స్థాపన కేవలం ధనికులకే సాధ్యమనే భావనను తొలగించి, సామాన్యులు కూడా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అనువైన వాతావరణం సృష్టించాలని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ, "రాష్ట్రంలో పెద్ద ఎత్తున పారిశ్రామికాభివృద్ధి జరుగుతోంది. ఈ ఫలాలు పేద, మధ్య తరగతికి ఉద్యోగాల రూపంలోనే కాకుండా, వారు కూడా కంపెనీలు స్థాపించేలా ప్రోత్సహించాలి. స్టార్టప్‌లకు పెద్దపీట వేయాలి. దీనికోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్టీఐహెచ్ (ఆర్టీఐహెచ్) సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని, వెంచర్ క్యాపిటలిస్టుల నుంచి పెట్టుబడులు ఆకర్షించాలి" అని దిశానిర్దేశం చేశారు.

ప్రాజెక్టులకు అనుమతులు పొందాక వెంటనే పనులు ప్రారంభించని సంస్థల విషయంలో కఠినంగా వ్యవహరించాలని, 'నాన్-సీరియస్ ప్లేయర్స్'కు ఏపీలో చోటులేదని హెచ్చరించారు.

**ఇథనాల్, సెమీ కండక్టర్లకు పెద్దపీట**

ఇథనాల్ ఆధారిత ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించాలని, దీనివల్ల రైతులకు ప్రయోజనం చేకూరడంతో పాటు ఇంధన దిగుమతుల భారం తగ్గుతుందని సీఎం అన్నారు. 40 శాతం ఇథనాల్ బ్లెండింగ్‌కు కేంద్రం అంగీకరించిన నేపథ్యంలో ఇథనాల్ తయారీ పరిశ్రమలను ప్రోత్సహించాలని సూచించారు.

అదేవిధంగా, సెమీ కండక్టర్ల తయారీకి అవసరమైన ఎకోసిస్టమ్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, లిథియం అయాన్, ఫాస్ట్ ఛార్జింగ్ బ్యాటరీల ఉత్పత్తిని ప్రోత్సహించాలని ఆదేశించారు. రైతుల కోసం ప్రత్యేకంగా మైక్రో ఇరిగేషన్ ఎక్విప్‌మెంట్ పార్క్ ఏర్పాటు చేయాలని, దీనివల్ల రైతులకు తక్కువ ధరకే పరికరాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

**పర్యాటకం, మౌలిక వసతులపై దృష్టి**

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని బలోపేతం చేసేందుకు టెంపుల్ టూరిజం, బీచ్ టూరిజం అభివృద్ధి చేయాలన్నారు. సూర్యలంక బీచ్‌కు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని, హార్సిలీ హిల్స్‌లో మంచి రిసార్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. పురాతన స్వర్ణగిరిగా పేరున్న జొన్నగిరి గోల్డ్ మైన్ ఉత్పత్తిని వేగవంతం చేయాలన్నారు. పారిశ్రామిక ప్రాంతాల వద్ద కార్మికులకు అందుబాటు ధరల్లో గృహ నిర్మాణాలు చేపట్టాలని, ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను ఆటోమేషన్ చేసి రాజకీయ జోక్యాన్ని తగ్గించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పుట్టపర్తిలో 5వ తరం ఫైటర్ జెట్ తయారీ కేంద్రాన్ని వేగంగా పూర్తి చేయాలని, బెంగళూరు-పుట్టపర్తిని ఏరోస్పేస్, డిఫెన్స్ కారిడార్‌గా మార్చాలని ఆదేశించారు.

**ప్రాజెక్టులు ప్రారంభించాకే ప్రోత్సాహకాలు: మంత్రి లోకేశ్**

ఈ సమావేశంలో పాల్గొన్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ కీలక సూచనలు చేశారు. భూ కేటాయింపులు పొందిన కంపెనీలు ప్రాజెక్టులను ప్రారంభించిన తర్వాతే ప్రోత్సాహకాలు, రాయితీలు అమలు చేయాలని స్పష్టం చేశారు. "ప్రాజెక్టులు వేగంగా ప్రారంభమైతేనే జీఎస్టీ రూపంలో రాష్ట్రానికి ఆదాయం వస్తుంది. అప్పుడు ప్రోత్సాహకాలు ఇవ్వడం సమంజసంగా ఉంటుంది" అని అభిప్రాయపడ్డారు.

స్థానిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని, ఆంధ్రా యూనివర్సిటీలో రేర్ ఎర్త్ మినరల్స్‌పై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## శాంతి ఒప్పందంపై సంతకాలు

**మొదటి పేజీ తరువాయి**

అమెరికా తొలగిస్తుంది. అయితే శాంతి ఒప్పందంలో ఇరాన్ అణు కార్యక్రమం ప్రస్తావన లేదు. దీనిపై కాల్పుల విరమణ అమలులో ఉండే 60 రోజుల కాలంలో చర్చించి నిర్ణయం తీసుకుంటారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ-7 సదస్సుకు హాజరైన సందర్భంగా ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. ఈ ఒప్పందం 'ఆర్థిక విపత్తు'ను తప్పిస్తుందని ఆయన చెప్పారు. అయితే ఇరాన్‌తో తుది ఒప్పందం కుదరని పక్షంలో ఆ దేశంపై బాంబు దాడులు తప్పవని హెచ్చరించారు. శాంతి ఒప్పందంపై ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ బుధవారమే సంతకం చేశారని టెహ్రాన్ ధృవీకరించింది. అయితే అమెరికాపై తన అపనమ్మకం అలాగే ఉండిపోయిందని, టెహ్రాన్ వేలు ట్రిగ్గర్ పైనే ఉన్నదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్, చర్చల ప్రతినిధి మహమ్మద్ బాఘర్ ఘలీబఫ్ చెప్పారు. అమెరికా కనుక తన హామీలను నెరవేర్చని పక్షంలో తామూ వాటికి కట్టుబడి ఉండబోమని స్పష్టం చేశారు. వర్సైలెస్ ప్యాలెస్‌లో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ ఇచ్చిన విందు సందర్భంగా ఎంఓయూ హార్డ్ కాపీపై ట్రంప్ సంతకం చేశారు. ఆ సమయంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఆయన వెనకే నిలుచుని ఉన్నారు. ట్రంప్ సంతకం చేసిన ఒప్పంద పత్రాన్ని అధికారులు ఇరాన్‌కు పంపారు. దానిపై టెహ్రాన్‌లో పెజెష్కియాన్ సంతకం చేస్తుండగా తీసిన చిత్రాలను ఇరాన్ ప్రభుత్వ మీడియా ఐఆర్ఎన్ఏ ప్రచురించింది. ఇరాన్ కోరిక మేరకు ఎంఓయూను ఆంగ్లంలోనూ, ఫార్సీ భాషలోనూ ముద్రించారు. 'సంతకం చేశాను' అని ట్రంప్ విలేకరులకు చెప్పారు. శాంతి ప్రణాళిక ప్రపంచవ్యాప్త మాంద్యాన్ని నివారిస్తుందని ఆయన తెలిపారు. జీ-7 సదస్సు జరిగిన ఎవియన్-లెస్-బెయిన్స్‌లోని రిసార్టులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్థిక విపత్తును చూడాలని తాను అనుకోవడం లేదని చెప్పారు. యుద్ధం కొనసాగితే అదే సంభవించి ఉండేదని అన్నారు. 'నాకు తెలిసింది ఒక్కటే. మనం శాంతికి అవకాశాల గురించి మాట్లాడిన ప్రతిసారీ స్టాక్ మార్కెట్ రాకెట్ మాదిరిగా దూసుకుపోయింది. రాజీకి రాలేము వంటి ప్రతికూల విషయాలు చెప్పినప్పుడు మాత్రం అది భారీగా పతనమైంది' అని తెలిపారు. మాక్రాన్ ఇచ్చిన విందుకు హాజరైన అనంతరం ట్రంప్ వాషింగ్టన్ బయలుదేరారు.

# గ్రీనింగ్ సొసైటీ ఏర్పాటు చేయండి

**మొదటి పేజీ తరువాయి**

గ్రీనింగ్ సొసైటీకి సంబంధించిన నిబంధనలు, నియామకాలు, విధివిధానాల ప్రతిపాదనలన్నీ కచ్చితంగా ప్రెసిడెన్షియల్ ఆర్డర్ 2025కి అనుగుణంగానే ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యత కలిగినది కావడంతో, ఎలాంటి కాలయాపన చేయకుండా సొసైటీ త్వరగా కార్యరూపం దాల్చేలా తక్షణ చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. గురువారం వెలగపూడి సచివాలయంలో అటవీశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీలోనూ ఒక నర్సరీ ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలి. ఎక్కడైనా పంచాయతీలో ఏర్పాటు సాధ్యం కాకపోతే, కనీసం మూడు, నాలుగు పంచాయతీలను ఒక క్లస్టర్‌గా చేసి, ఉమ్మడిగా ఒక నర్సరీ ఉండేలా వెంటనే పనులు ప్రారంభించాలి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 'వీబీ-జీ రామ్ జీ' పథకం కిందకు నర్సరీల పెంపకాన్ని కూడా అనుసంధానించాం. ఈ పథకం ద్వారా లభించే నిధులు, ఉపాధి దినాలను సమర్థంగా ఉపయోగించుకుని, గ్రామీణ ప్రాంతాల్లో నర్సరీలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేయాలి" అన్నారు.

పర్యావరణ పరిరక్షణ, అడవుల పెంపకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా చల్లడానికి 2.6 కోట్ల సీడ్ బాల్స్ సిద్ధం చేసినట్లు అటవీ శాఖ అధికారులు శ్రీ పవన్ కళ్యాణ్ గారికి తెలిపారు. ఈ వర్షాకాలంలోనే వీటిని అటవీ, ఖాళీ ప్రాంతాలలో వెదజల్లేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు వెల్లడించారు. కొండ కోనల్లో విత్తనాలను చల్లడానికి ఈసారి సుమారు 40 నుంచి 50 అత్యాధునిక డ్రోన్లను ఉపయోగిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రణాళికపై స్పందించిన పవన్ కళ్యాణ్ గారు, సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని కేవలం ప్రభుత్వ ఉద్యోగులకే పరిమితం చేయకుండా, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయాలి. విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలను కలుపుకొని దీనిని ఒక ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

రాష్ట్రంలో అంతరించిపోతున్న అరుదైన వృక్ష జాతులను రక్షించేందుకు అటవీ శాఖ తీసుకుంటున్న ప్రత్యేక చర్యలపై శ్రీ పవన్ కళ్యాణ్ గారు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు అటవీ శాఖ ఉన్నతాధికారులైన పీసీసీఎఫ్, హెచ్ఓఎఫ్ఎఫ్ లను, వాళ్ల బృందాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో పాములేరు వాగు వెంబడి కేవలం 10 మాత్రమే మిగిలి ఉన్న అత్యంత అరుదైన, అంతరించిపోతున్న వెదురు జాతిని అధికారులు గుర్తించారు. క్షేత్రస్థాయిలో చేసిన లోతైన పరిశోధనలు, ఆధునిక మాలిక్యులర్ సైన్స్ ద్వారా ఈ కొత్త జాతిని గుర్తించారు.

## క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి.

**..హోంగార్డులకు ప్రమాదబీమా సౌకర్యంపై యాక్సిస్ బ్యాంక్ ప్రతినిధులతో అవగాహన.**


**..ప్రజలకు మెరుగైన సేవలు అందించి మన్ననలు పొందండి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ జూన్ 18:**

నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు నేటి ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలోని మైదానంలో హోంగార్డ్స్ పెరేడ్ మరియు దర్బార్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి 60 మంది హోంగార్డులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హోంగార్డ్స్ కమాండెంట్ ఎం.మహేష్ కుమార్ హోంగార్డ్ కవాతును పరిశీలించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ హోంగార్డ్ సంక్షేమానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ప్రతి సంవత్సరం హోంగార్డులకు మరియు వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు చేయించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్



కలిగి ఉండాలని దాని వలన కలిగే ఉపయోగాలను గురించి తెలియజేశారు. మరియు హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు , వాటి ప్రయోజనాలు , ఆరోగ్య భద్రత కోసం బీమా ప్రాముఖ్యతపై యాక్సిస్ బ్యాంక్ ప్రతినిధులతో హోంగార్డులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతోపాటు నంద్యాల జిల్లాకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకొని వచ్చే విధంగా అందరూ కృషి



చేయాలని ఆకాంక్షించారు.

అనంతరం ఉత్తమ ప్రతిభ కనపరచిన హోంగార్డులకు ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో కమాండెంట్ తో పాటు జిల్లా సాయుధ బలగాల అడిషనల్ ఎస్పి బి. చిన్ని కృష్ణ , ఏ ఆర్ డీఎస్పీ శ్రీనివాసులు,హోంగార్డ్ డి.ఎస్.పి ప్రసాద్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు బాబు, విజయ్ ఆర్ఎస్ఐ లు హర్షవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శుక్రవారం 19 జూన్ 2026

# జిల్లాలో జూన్ 21న నీట్ రీ-ఎగ్జామినేషన్ కు పకడ్బందీ ఏర్పాట్లు.

**..జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి.**

**..జిల్లాలోని 16 నిర్దేశిత కేంద్రాలలో పరీక్షకు హాజరు కానున్న 4,995 విద్యార్థులు.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూన్ 18:**
ఈ నెల 21 వ తేదీన జరగనున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నీట్ (యూజీ)2026 రీ-ఎగ్జామినేషన్ ను ఎలాంటి లోపాలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి పేర్కొన్నారు.

ఈ నెల 21వ తేదీ (ఆదివారం) మధ్యాహ్నం 2 గం నుండి 5 గం వరకు జిల్లా వ్యాప్తంగా నిర్దేశించిన పరీక్షా కేంద్రాలలో ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. దివ్యాంగ అభ్యర్థులకు సాయంత్రం 6.15 గంటల వరకు అదనపు సమయం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డులో పేర్కొన్న రిపోర్టింగ్ సమయానికి చాలాముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకుని భద్రతా తనిఖీలు, ధృవీకరణ ప్రక్రియలను పూర్తి చేసుకోవాలని సూచించారు.

జిల్లాలోని 16 నిర్దేశిత కేంద్రాలలో ఈ పరీక్ష నిర్వహించబడుతుందని, సుమారు 4,995 విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు.

రీ-ఎగ్జామినేషన్ ను పారదర్శకంగా నిర్వహించడానికి తహశీల్దార్, ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ లకు మానిటరింగ్ ఆఫీసర్ లుగా పరీక్ష కేంద్రాల వద్ద పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ప్రతి సెంటర్ కు ఒక తహసీల్దార్, ప్రతి నాలుగు సెంటర్లకు జిల్లా అధికారిని నోడల్ ఆఫీసర్ గా నియమించామని తెలిపారు. పోలీస్ అధికారులు మరియు ఇతర శాఖాధికారులతో సమన్వయం చేసుకుంటూ, పరీక్ష సజావుగా, నియమ నిబంధనలకనుగుణంగా నిర్వహించడానికి కృషి చేస్తారని కలెక్టర్ తెలియజేశారు.

పరీక్షా కేంద్రాల వద్ద తగిన సంఖ్యలో పోలీసు సిబ్బందిని నియమించి భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, జనసందోహ నిర్వహణకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు.

పరీక్షా నిర్వహణతో ప్రత్యక్ష సంబంధం లేని అధికారులు, వ్యక్తులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. పరీక్షా విధుల్లో ఉన్న సిబ్బంది, ఎన్‌టీఏ అధికారులు, జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సభ్యులకు మాత్రమే కేంద్రాల్లో ప్రవేశానికి అనుమతి ఉంటుందని పేర్కొన్నారు.

అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక నోడల్ పోలీసు అధికారిని నియమించారని, ప్రతి 100 మంది అభ్యర్థులకు ఒక ఫ్రిస్కింగ్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫ్రిస్కింగ్ బృందాల్లో మహిళా పోలీసు సిబ్బంది, మహిళా హోమ్ గార్డులు తగిన సంఖ్యలో ఉండేలా చూడాలని తెలిపారు. హ్యాండ్‌హెల్డ్ మెటల్



డిటెక్టర్లతో అభ్యర్థుల తనిఖీలు నిర్వహించాలని పేర్కొన్నారు. నీట్ యూజీ2026 రీ-పరీక్షలను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

రీ-ఎగ్జామినేషన్‌కు అర్హత పొందిన అభ్యర్థుల కోసం తాజా అడ్మిట్ కార్డులు అధికారిక నీట్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలియజేశారు. అభ్యర్థులు తమ తాజా అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకుని, అందులో పేర్కొన్న పరీక్షా కేంద్రం, రిపోర్టింగ్ సమయం తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. గతంలో జారీ చేసిన అడ్మిట్ కార్డులు ఈ రీ-ఎగ్జామినేషన్‌కు చెల్లవని స్పష్టం చేశారు.

పరీక్షను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా మరియు సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రశ్నాపత్రాల భద్రత, పర్యవేక్షణ వ్యవస్థల బలోపేతం, పరీక్షా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ, అదనపు తనిఖీ విధానాల విషయంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.

విద్యుత్ శాఖ అధికారులు రీ-పరీక్షల సందర్భంగా అన్ని పరీక్షా కేంద్రాల్లో నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రత్యామ్నాయ విద్యుత్ ఏర్పాట్లను సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు.

వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పరీక్షా కేంద్రాల వద్ద అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచడంతో పాటు, అవసరమైన మందులు, వైద్య సిబ్బందిని అందుబాటు లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేయడంతో పాటు, పరీక్ష అనంతరం తిరుగు ప్రయాణానికి కూడా తగిన రవాణా సౌకర్యాలు కల్పించాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించామని తెలిపారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులు శారీరక వైకల్యం ఉన్న అభ్యర్థులకు వీల్‌చైర్లు, ర్యాంపులు తదితర అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

తహసీల్దార్లు, పోలీసు శాఖ అధికారులు పరీక్షా కేంద్రాల పరిసరాల్లో శాంతిభద్రతలను కట్టుదిట్టంగా నిర్వహించాలని, అవసరమైన చోట భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్-163 ప్రకారం ఉత్తర్వులు జారీ చేసి ప్రశాంత వాతావరణాన్ని కల్పించడం జరుగుతోందన్నారు.

దివ్యాంగ అభ్యర్థులకు పరీక్షా కేంద్రాల్లో అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు వీఆర్ఏలను నియమించాలని కలెక్టర్ సూచించారు.

పరీక్షా మార్గదర్శకాలు మరియు నియమావళిని తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘించిన పక్షంలో పరీక్షా కేంద్రంలో ప్రవేశం నిరాకరించబడడం లేదా అభ్యర్థిత్వం రద్దు చేయబడే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.

రీ-పరీక్షల నిర్వహణలో భాగస్వామ్యమవుతున్న అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి పరీక్షలను విజయవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోరారు

# యోగ ద్వారా మానసిక ఒత్తిడి దూరం అవుతుంది -ఆరోగ్యంగా ఉండగలుగుతాం.

**కర్నూలు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి ప్రజల సహకారం అవసరం. -కర్నూలు కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ మరియు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.**

**.మానసిక , శారీరక ఆరోగ్యం యోగా ద్వారా సిద్ధిస్తుంది. -పాణ్యం శాసనసభ్యులు గౌరు చరిత.**






**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్ జూన్ 18:**
ఒత్తిడిని తగ్గించుకొని మనసును ప్రశాంతంగా ఉంచుకోవడానికి యోగా చాలా ఉపయోగకారిగా పనిచేస్తుందని కావున అందరూ ప్రతి రోజు యోగా చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి మున్సిపల్ పారిశుద్ధ కార్మికుల ధిమాటిక్ యోగ కార్యక్రమంలో కార్మికులను ఉద్దేశించి పేర్కొన్నారు.

గురువారం కర్నూలు ఎస్ ఏ పి క్యాంపు ఆవరణలో ధిమాటిక్ యోగాలో భాగంగా పారిశుద్ధ కార్మికుల యోగా కార్యక్రమంలో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ మరియు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి , జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ , పాణ్యం శాసనసభ్యులు గౌరు చరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పారిశుద్ధ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ... ఒత్తిడిని తగ్గించుకొని మనసును ప్రశాంతంగా ఉంచుకోవడానికి , ఆరోగ్యంగా ఉండడానికి యోగా చాలా ఉపయోగకారిగా పనిచేస్తుందని కావున అందరూ ప్రతి రోజు యోగా చేయాలని అన్నారు. అందుకే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యోగాను ప్రతి ఒక్కరు చేయాలన్న ఉద్దేశంతో కార్యక్రమాలు చేయిస్తున్నారని తెలిపారు.యోగ వలన రక్తపోటు , మధుమేహ వ్యాధి రావని ఉంటే కంట్రోల్ లోనే ఉంటాయని తెలిపారు. చిన్నపిల్లలు చేసిన అడ్వాన్స్ యోగ చాలా బాగుందని మెచ్చుకున్నారు. ఈ పిల్లలను ఈ విధంగా చేయడానికి ప్రోత్సహించిన తల్లిదండ్రులకు మరియు వారికి యోగ నేర్పించిన గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విధంగా యోగా చేస్తూ ఉంటే ఈ పిల్లలు భవిష్యత్తులో ఎటువంటి అనారోగ్యాలకు గురి కారని కలెక్టర్ తెలియజేశారు. ఇప్పుడున్న పరిస్థితుల వలన ప్రతి ఒక్కరూ ఒత్తిడికి గురవుతూ ఉన్నారని , దీనివలన అనేక రుగ్మతలకు గురికావలసి వస్తున్నదని అందులో భాగంగా ఫర్టిలిటీ రేటు తగ్గిపోయిందని దీనిని సరి చేసుకోవటానికి ఫర్టిలిటీ సెంటర్స్ పెరిగాయని మన ముందు తరాల వారికి ఫర్టిలిటీ సెంటర్ల విషయం అసలు తెలియవు అని వారికి అవసరం రాలేదు అన్నారు. యోగా ద్వారా ఒత్తిడి ని దూరం చేసుకుని మనసు ప్రశాంతంగా ఉంచుకోవలసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్ తెలియజేశారు. ప్రభుత్వం టూరిజం ప్రదేశాలలో మరియు ప్రముఖ ఆలయాలలో యోగ కార్యక్రమాలు నిర్వహించే విధంగా ఆదేశాలు ఇచ్చినందున కర్నూలు ఓర్వకల్లు రాక్ గార్డెన్స్ , కొండారెడ్డి బురుజులలో యోగా కార్యక్రమాలు జరిపామని , ఆలయాలలో కూడా జరుగుతున్నదని జిల్లా కలెక్టర్ తెలియజేశారు. ఈ విధంగా చేయడం వలన అందరికీ యోగ యొక్క ప్రాముఖ్యత తెలిసి యోగ చేయడానికి ముందుకు వస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

ఈ రోజు ఇక్కడ కు పెద్ద ఎత్తున యోగాలో పాల్గొనడానికి వచ్చిన పారిశుద్ధ కార్మికులందరికీ మరియు కర్నూలు నగరాన్ని శుభ్రం చేస్తున్న మీ అందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను అన్నారు. మీరు చేస్తున్న పని అందరికీ అవసరమైన చాలా మంచి పని అని కొనియాడారు. ప్రమాదకర పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే చర్యలు పారిశుద్ధ కార్మికులు చేస్తూ ఉంటారు.మీకు వ్యాధులు సోకకుండా మీకు అందజేసే గ్లౌజులు , బట్టలు వేసుకుని మీ విధులు నిర్వర్తించాలని , మీరందరూ యోగా చేస్తూ మీ ఆరోగ్యాలను పరిరక్షించుకోవాలని కోరారు. ప్రజలు కూడా భాధ్యత గా వ్యవహారిస్తూ ప్రభుత్వానికి సహకరించి చెత్తను ఎక్కడ అంటే అక్కడ పడవ వేయకుండా నగరం పరిశుభ్రంగా ఉండేవిధంగా సహకరించాలని కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ మరియు జిల్లా కలెక్టర్ కోరారు. జిల్లా నుండి విజయవాడకు యోగాలో పోటీలో పాల్గొనడానికి మన జిల్లా వాళ్లు వెళ్లడం జరిగింది వారు అక్కడ యోగాలో మంచి ప్రావీణ్యం ప్రదర్శించి మెడల్స్ సాధిస్తారని ఆశిస్తున్నాను అని కలెక్టర్ తెలిపారు. ఈ యోగ సమావేశాన్ని ఉద్దేశించి పాణ్యం శాసనసభ్యులు గౌరు చరిత మాట్లాడుతూ... ఆరోగ్యమే మహాభాగ్యం అని , శారీరకంగా మానసికంగా ధ్రుడంగా ఉండటానికి , అన్ని సమస్యలను ఎదుర్కొనడానికి యోగ ఉపయోగపడుతుందని తెలిపారు. పారిశుద్ధ కార్మికులకు కూడా మానసిక సమస్యలు ఉంటాయని వాటిని యోగ ద్వారా నియంత్రించుకోవచ్చు అని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ ప్రతిరోజు ఒక గంట యోగ చేయాలని శాసనసభ్యులు తెలియజేశారు.కొంతమంది ప్రజలు తమ ఇల్లు మాత్రమే పరిశుభ్రంగా ఉంటే చాలు అనుకుంటారని అది సరైనది కాదని వారి ఇంటితోపాటు పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలతో వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేసి అన్ని ప్రదేశాలలో అన్ని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే చర్యలు తీసుకుంటున్నారని కావున ప్రజలు ఈ కార్యక్రమాలలో పాలుపంచుకొని ప్రభుత్వం కు సహకరించాలని కోరారు.

ఈ యోగ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ , పాణ్యం శాసనసభ్యులు గౌరు చరిత , మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు , రీజనల్ టూరిజం అధికారి లక్ష్మీనారాయణ , మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రఘు , సెట్కూర్ సి ఈ ఓ వేణుగోపాల్, ఎస్ ఏ పి క్యాంపు డి ఎస్ పి మహబూబ్ బాషా , ఆయుష్ జిల్లా యోగా నోడల్ అధికారి డాక్టర్ అమర్నాథ్ ,ఆయుష్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రసాద్ , యోగ రాష్ట్ర సెక్రటరీ అవినాష్ మొదలగువారు పాల్గొన్నారు.

# జూన్ 24న జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి.

**-జొన్నగిరి జియో మైసూర్ గోల్డ్ మైన్స్ సందర్శన బహిరంగసభకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి.**

**..జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూన్ 18:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 24న కర్నూలు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి తొలుత హెలిప్యాడ్‌కు చేరుకుని జొన్నగిరిలోని జియో మైసూర్ గోల్డ్ మైన్స్‌ను సందర్శిస్తారని తెలిపారు. ఇందులో భాగంగా భూమిపూజ, బంగారం పంపిణీ కార్యక్రమం, ప్లాంట్ పరిశీలన అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారని వివరించారు.

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎటువంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. హెలిప్యాడ్, రహదారులు, బారికేడింగ్, పార్కింగ్ ఏర్పాట్లను రోడ్లు మరియు భవనాల శాఖ అధికారులు పూర్తి చేయాలని ఆదేశించారు. తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, ఇంటర్నెట్, పారిశుధ్యం, లైటింగ్, సౌండ్ సిస్టమ్, ఎల్ఈడీ స్క్రీన్లు, మొబైల్ టాయిలెట్లు, మెడికల్ క్యాంప్‌లు, తదితర ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే వ్యవసాయ రంగానికి సంబంధించి పీఎండీఎస్, డ్రిప్ ఇరిగేషన్, జలధార-జలహారతి, స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర, డి ఆర్ డి ఏ, స్కిల్ డెవలప్మెంట్ తదితర కార్యక్రమాల ద్వారా సాధించిన విజయాలను ప్రతిబింబించేలా ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రొటోకాల్ నిబంధనలకు అనుగుణంగా వీవీఐపీ, వీఐపీ అతిథుల కోసం ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు. సమావేశానికి వచ్చిన ప్రజలకు భోజనం ఏర్పాట్లలో లోపం లేకుండా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, పత్తికొండ ఆర్డీవో ఓబులేసు, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ మధుసూదన్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్ అర్జీదారులకు కలెక్టర్ ఫోన్.



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూన్ 18:** పిజిఆర్ఎస్ కు సంబంధించి రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ గారి కార్యాలయం నుండి వచ్చిన అర్జీలను పరిశీలించి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి అర్జీదారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.

గురువారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ నుండి అర్జీదారులకు కలెక్టర్ ఫోన్ చేసి మాట్లాడారు. ఇందులో భాగంగా రెవెన్యూ శాఖకు సంబంధించి తుగ్గలి మండలం సి. శ్రీనివాసులు, మంత్రాలయం మండలం విజయ లక్ష్మి తో వారి సమస్యల గురించి విచారించి, అనంతరం సంబంధిత తహసిల్దార్లతో మాట్లాడి వెంటనే సమస్యలను పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ప్రతి వారం స్వయంగా అర్జీదారులతో మాట్లాడి అర్జీలను పరిష్కరించడం ద్వారా అర్జీదారులు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.సమావేశంలో పిజిఆర్ఎస్ నోడల్ అధికారి మరియు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి దీప్తి పాల్గొన్నారు.

# జులై 11న అన్ని కోర్టు ప్రాంగణంలలో జాతీయ లోక్ అదాలత్

**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్ జూన్ 18:**
జూన్ 18న జిల్లా న్యాయ సేవా సదన్ నందు జిల్లా ప్రధాన న్యాయమూర్తి/జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ జి.కబర్ది సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మునిసిపల్ మరియు సచివాలయం మరియు కెనరా లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ట్ మేనేజర్, బి యస్ యన్ యల్ అధికారులతో జులై 11 న జరుగబోయే జాతీయ లోక్ అదాలత్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో కోర్టులలో ఉన్న సివిల్ కేసులు, భూ సేకరణ కేసులు, టాక్స్ కేసులు, మున్సిపల్ కేసులు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని



అధికారులకు సూచించారు. ఈ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా ప్రత్యేక దృష్టి సారించి ఈ లోక్ అదాలత్ ను విజయవంతం అయ్యేలా కృషి చేయాలని కోరారు.ప్రతి రోజు ఉమ్మడి కర్నూలు మరియు నంద్యాలలో గల



కోర్టుల నందు ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ జరుగుచున్నాయని ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని కక్షి దారులు తమ కేసులను ఈ ప్రీ సిట్టింగ్ లోక్ అదాలత్ లలో రాజీపూర్వకంగా పరిష్కరించుకోగలరని కోరారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయం అధికారులు, బ్యాంకు అధికారులు, భూ సేకరణ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.

**..మత్తు పదార్థాల రవాణా ను అరికట్టాలి. -జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.**




**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్ జూన్ 18 :** ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని , మత్తు పదార్థాల సేవనం రవాణా అరికట్టాలని జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధిమాటిక్ యోగ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సెట్కూర్ సీఈవో వేణుగోపాల్ ప్రతిజ్ఞ చేయించారు. యోగ ఆంధ్ర కార్యక్రమంలో ఈగల్ టీం వారు మత్తు పదార్థాలు గుట్కా , గాంజా , హాఫీమ్, ఎం డి ఎం మరియు ఇతర కెమికల్స్ ను ఎవరు వాడరాదని , ఎవరు రవాణా చేయకూడదని , మత్తు పదార్థాలకు ఎవరు బానిస కారాదని అన్న విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలి , తెలియజేయాలి అన్న ఉద్దేశంతో యోగ కొరకు సమావేశమైన అందరి చేత జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ఆధ్వర్యంలో సెట్కూర్ సి ఈ ఓ వేణుగోపాల్ ప్రతిజ్ఞ చేయించారు.ఈ ప్రతిజ్ఞ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ , పాణ్యం శాసనసభ్యులు గౌరు చరిత , మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు , రీజనల్ టూరిజం అధికారి లక్ష్మీనారాయణ , మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రఘు , సెట్కూర్ సి ఈ ఓ వేణుగోపాల్, ఎస్ ఏ పి క్యాంపు డి ఎస్ పి మహబూబ్ బాషా , ఆయుష్ జిల్లా యోగా నోడల్ అధికారి డాక్టర్ అమర్నాథ్ ,ఆయుష్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రసాద్ , యోగ రాష్ట్ర సెక్రటరీ అవినాష్ , కర్నూల్ మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ కార్మికులు మొదలగువారు పాల్గొన్నారు.

## మార్క్‌ఫెడ్ గోదాముల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 18:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ శాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ నేడు నంద్యాలలోని బొమ్మలసత్రం లో ఉన్న మార్క్‌ఫెడ్ కార్యాలయం మరియు గోదాములను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పర్యటనలో భాగంగా మంత్రి ఫరూక్ గోదాముల్లో నిల్వ ఉన్న సరుకు నిల్వలను (స్టాక్) క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అక్కడున్న రికార్డులను తనిఖీ చేసి, నిల్వల వివరాలు, పంపిణీ తీరును గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిల్వల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా, పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులను మంత్రి ఫరూక్ ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు సకాలంలో సేవలు అందేలా చూడాలని, గోదాములలో ఉన్న సరుకుల నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, నంద్యాల మండల కన్వీనర్ మునగాల విశ్వనాథ్ రెడ్డి, ఉడుమలాపురం కళ్యాణ్, రాయమాల్పురం చంద్రారెడ్డి, పబ్బతి వేణు , మున్నా, నాగేశ్వరరావు, బుగ్గ రాముడు మరియు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వై.ఎస్.ఆర్ నగర్ లో రోడ్లు, డ్రైనేజీ పనులకు భూమిపూజ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల , జూన్ 18:**
నంద్యాల టౌన్ 38 వార్డ్ వై.ఎస్.ఆర్ నగర్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు . ఈ మేరకు వార్డులో రోడ్లు మరియు డ్రైనేజీ కాల్వల నిర్మాణ పనులకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ హాజరై భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ "ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం అన్నారు. వై.ఎస్.ఆర్ నగర్ అభివృద్ధికి టి.డి.పి. కట్టుబడి ఉందని . ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఎటువంటి రాజీ పడబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ , 38వ వార్డు ఇంచార్జి తాటికొండ



బుగ్గరాముడు, మహేష్ బాబు, హిమామ్ హుస్సేన్, నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న , టీడీపీ నాయకులు వడ్డే నాగేంద్ర, మరాఠీ సూరి ,చిన్న రాముడు, సౌభాగ్యవతి, యాలిశా, హసాన్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటోనగర్ లో నూతన రోడ్డు పనులకు భూమిపూజ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 18:**
నంద్యాల ఆటోనగర్ పరిధిలో నూతన రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు ఇవ్వడంతో, ఈరోజు ఆ రోడ్డు నిర్మాణ పనులకు ఘనంగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి గారు టెంకాయ కొట్టి, రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల ఆటోనగర్ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ నూతన రోడ్డు నిర్మాణంతో ఆటోనగర్‌లోని ప్రజలకు, వాహనదారులకు రాకపోకలు సులభతరం అవుతాయని, దీనివల్ల వ్యాపార కార్యకలాపాలు మరింత మెరుగుపడతాయని అన్నారు . అభివృద్ధి పనుల విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, ప్రజల సౌకర్యార్థం నాణ్యమైన రోడ్ల నిర్మాణానికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, నంద్యాల మండల కన్వీనర్ మునగాల విశ్వనాథ్ రెడ్డి, ఆటోనగర్ జాకీర్ , ఉడుమలాపురం కళ్యాణ్, రాయమాల్పురం చంద్రారెడ్డి, పబ్బతి వేణు , మున్నా, నాగేశ్వరరావు, బుగ్గ రాముడు మరియు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలి

**ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో నమోదు కావాలి.**

**.బీఎల్ఓలు ఎన్యుమరేషన్ ఫారాలను స్వయంగా బీఎల్ఓ యాప్‌లో నమోదు చేయాలి.**

**..జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 18:**
ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా గురువారం సిరివెళ్ల మండలంలోని గోవిందపల్లి గ్రామాన్ని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని స్వర్ణగ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు.
సచివాలయ పరిధిలో పనిచేస్తున్న బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు) నిర్వహిస్తున్న పనితీరు, వారి సంఖ్య, రోజువారీగా స్వీకరిస్తున్న దరఖాస్తులు, వాటి పరిష్కార స్థితి, ఇప్పటివరకు నమోదైన చేర్పులు, తొలగింపులు, మార్పుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏలు)తో సమావేశమై ప్రత్యేక సవరణ కార్యక్రమంపై వారి అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్నారు. ప్రతి అర్హుడైన ఓటరు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా చర్యలు చేపట్టాలని, ఎలాంటి ఫిర్యాదులకు తావు లేకుండా కార్యక్రమాన్ని సమగ్రంగా అమలు చేయాలని సూచించారు.
జిల్లాలో ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ధృవీకరణ అనంతరం ఎన్యుమరేషన్ ఫారాలను స్వయంగా బీఎల్ఓ యాప్‌లో నమోదు చేసి పూర్తి చేయాలని సూచించారు. వివరాల నమోదు సమయంలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా అత్యంత జాగ్రత్తతో వ్యవహరించాలని, ప్రతి అర్హ ఓటరుకు సంబంధించిన సమాచారం ఖచ్చితంగా నమోదు కావాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా నాణ్యతను మెరుగుపరచడం, పారదర్శకతను పెంపొందించడం లక్ష్యంగా ప్రతి ఎన్యుమరేషన్ ఫారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి యాప్‌లో నవీకరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రత్యేక సవరణ కార్యక్రమం విజయవంతం కావడానికి రాజకీయ పార్టీలు, బీఎల్ఏలు, బీఎల్ఓలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

## ఆ చెరువులో చేపలను తిమింగలాలు మింగేస్తాయి.




**ఆంధ్ర ప్రగతి మహానంది జూన్ 18:**
ఆ చెరువులో చిన్న, పెద్ద చేపలను తేడా లేకుండా తిమింగలాలు మింగేస్తాయని విశ్వాసనీయ సమాచారం. మహానంది మండలంలోని ఒక గ్రామంలో దాదాపు 150 నుండి 180 ఎకరాల్లో చెరువు ఎప్పుడో బ్రిటిష్ కాలం నందు నిర్మించి ఉంది. ఇది ఆ గ్రామానికి వరప్రదాయిని. చెరువులో నీరు ఉంటే భూగర్భ జలాలు పెరిగి బోర్లు బావులలో నీరు సమృద్ధిగా ఉండి పంటలు పండడంతో రైతులు ఆనందంగా ఉంటారు. కానీ ఇక్కడ మాత్రం చెరువులో జూన్ జూలై నీరు ఉన్నప్పుడు వర్షాకాల ప్రారంభంలో పిల్ల చేపలను వదిలి అవి పెరిగి పెద్దవైన తర్వాత ఎవరి అనుమతులు లేకుండా ఏప్రిల్ మే జూన్ మాసాల్లో పరిస్థితులు అనుకూలంగా మార్చుకొని పిల్ల పెద్ద చేపలను తేడా లేకుండా ఒక కేజీ 100 రూపాయల పైననే బహిరంగంగా క్రయవిక్రయాలు చేస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామపంచాయతీకి చెరువులో చేపల క్రయవిక్రయాలపై ఎలాంటి సమాచారం, పన్ను చెల్లింపులు లేవు అనే దానిపై కూడా వివాదం నెలకొన్నట్టు సమాచారం. ఫిషరీస్ డిపార్ట్మెంట్ కు నామమాత్రంగా 45 వేల రూపాయలు చెల్లించి చెరువులో చేపలను ఇష్ట రాజ్యాంగ క్రయవిక్రయాలు అధికారికంగా/ అనధికారికంగా కొనసాగిస్తున్నారన్న తీవ్ర విమర్శలకు తావిస్తున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. కనీసం గ్రామపంచాయతీ కార్యాలయంలో కూడా చెరువు లోని చేపలు క్రయవిక్రయాలు , వేలాల నిర్వహణకు సంబంధించి ఎలాంటి అనుమతులు అధికారికంగా, అనధికారికంగా ఉన్నాయి అన్నది బహిర్గతం చేయడం లేదని సమాచారం . దీనిపై గ్రామపంచాయతీ మాత్రం మీన మేషాలు లెక్కవేస్తూ లెక్కలు చెప్పడానికి జంకుతుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. గతంలో కూడా అధికార పార్టీలో ఉన్న వ్యక్తులు గ్రామ పంచాయతీకి ఎలాంటి పనులు చెల్లించకుండా ఇదే నిర్వాహకం చేపట్టినట్లు తెలుస్తుంది. గ్రామంలోని ఒక గుడికి పూజ కార్యక్రమంలో భాగంగా చేపల చెరువులో వచ్చే ఆదాయాన్ని ఎవరు అధికారంలో ఉంటే వారు కొంత మొత్తాన్ని చెల్లించి చేపల చెరువులో వచ్చే ఆదాయాన్ని సింహభాగాన్ని తమ సొంత అవసరాల కోసం పార్టీ ప్రజా యోజనాల కోసం సొంత అనుచర గణం ను పెంచి పోషించుకోవడానికి ఉపయోగించుకున్నట్టు తెలుస్తుంది. విచిత్రం ఏమంటే ఆ గ్రామంలో మత్స్యకారులు లేకపోవడంతో మండలంలోని సమీప గ్రామంలో ఉన్న మత్స్యకారులకు అనధికారికంగా, అధికారంలో ఉన్న వ్యక్తులు గ్రామ పంచాయతీకి సంబంధం లేకుండా చేపలు పట్టి క్రయవిక్రయాలకు అనుమతులు ప్రాధాన్యత ఇవ్వడం తీవ్ర దుమారం రేపుతున్నట్టు తెలుస్తుంది. గతంలో ఉన్న అధికార పార్టీ వ్యక్తులు కూడా గ్రామపంచాయతీ కి ఫిష్ రిస్ విభాగానికి నామమాత్రంగా కొంత మొత్తాన్ని చెల్లించి ఆదాయం పొందారని అదేవిధంగా కూడా ప్రస్తుతం కొనసాగుతున్నట్లు తెలుస్తుంది. జిల్లా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి ఆ గ్రామంలోని చేపల వేలం క్రయ విక్రయాలు తదితర వాటిపై దృష్టి సారిస్తే పలు ఆసక్తికర విషయాలు వెలుగులోనికి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీనిపై ప్రభుత్వానికి ఆదాయమే తప్ప నష్టం ఏమీ ఉండదని దీనిపై విచారణకు ఉన్నత స్థాయి అధికారులు చట్టపరంగా చర్యలు తీసుకుంటే గ్రామ పంచాయతీకి ఆదాయం వస్తుందని వాదన వినవస్తుంది. దీనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు అనేది ప్రశ్నార్థకంగా మారింది.

## పేస్‌మేకర్ శస్త్రచికిత్స విజయవంతం.

**-.చిన్నారిని పరామర్శించిన ఎస్‌డీఆర్ విద్యాసంస్థల అధినేత శనివారపు కొండారెడ్డి.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూన్ 18:**నంద్యాల అగ్నిమాపక కేంద్రంలో కాంట్రాక్టు హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న నాగేంద్ర కుమారుడు ఉమేష్ గుండె సంబంధిత సమస్యతో బాధపడుతూ.. ఇటీవల విజయవంతంగా పేస్‌మేకర్ శస్త్రచికిత్స చేయించుకున్నాడు. బాలుడి వైద్యానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ అధ్యక్షుడు సద్దల చంద్రశేఖర్ రెడ్డి చొరవతో, ఎస్‌డీఆర్ స్కూల్ మరియు ఎస్‌డీఆర్ ఆకాంక్ష జూనియర్ కాలేజ్ అధినేత శనివారపు కొండారెడ్డి సహకారంతో అందించడం జరిగింది. ఈ నేపథ్యంలో చిన్నారి ఉమేష్ ఎస్‌డీఆర్ స్కూల్ మరియు ఎస్‌డీఆర్ ఆకాంక్ష జూనియర్ కాలేజ్ చైర్మన్ శనివారపు కొండారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆపరేషన్ విజయవంతం కావడం, బాలుడు ఆరోగ్యంగా ఉండడం చూసి కొండారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఉమేష్ సంపూర్ణ ఆరోగ్యంతో ఎదిగి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నాగేంద్ర కుటుంబ సభ్యులు తమకు అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన ఎస్‌డీఆర్ యాజమాన్యానికి, హెల్పింగ్ హ్యాండ్ సొసైటీకి కృతజ్ఞతలు తెలిపారు.

## గాజులపల్లెలో ఫార్మ్ పాండ్‌ను పరిశీలించిన కలెక్టర్.



**ఆంధ్ర ప్రగతి మహానంది జూన్ 18:**మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో కమ్యూనిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫార్మ్ పాండ్‌ను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా గురువారం పరిశీలించారు. గ్రామంలో అమలవుతున్న సహజ సిద్ధ వ్యవసాయ విధానాలను పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడి సాగు పద్ధతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతు హుస్సేన్ రెడ్డి తన పొలంలో వీడ్ మ్యాట్స్ వినియోగంతో రోజ్ (గులాబీ) సాగు, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా మేరిగోల్డ్ (బంతిపూలు) సాగు చేస్తున్న విధానాన్ని కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఆయిల్ పామ్ తోటల్లో సాగు చేస్తున్న అంతర పంటలు, పీఎండీఎస్ విధానంలో చేపడుతున్న వ్యవసాయ పద్ధతులపై అధికారులు, రైతుల నుంచి సమాచారం సేకరించారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మండపం అభివృద్ధికి అన్నివిధాలా తోడ్పాటును అందిస్తా..!

**-..ప్రముఖ పారిశ్రామికవేత్త గోళ్ళ రాజేష్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూన్ 18:**
పట్టణంలోని రోజాకుంటలో ఏర్పాటుచేసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణమండపంను ఈరోజు కళ్యాణమండపం అధ్యక్షులు ఉపాధ్యక్షులు మరియు కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు నంద్యాల వాసి ప్రముఖ వ్యాపారవేత్త, సామాజికవేత్త గోళ్ళ రాజేష్ సందర్శించారు. ఈ సందర్భంగా నంద్యాల పట్టణంలోని రోజాకుంటలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానము,శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మండపం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు,కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నంద్యాల వాసి ప్రముఖ వ్యాపారవేత్త గోళ్ళ రాజేష్ కు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మండపం అధ్యక్షులు మేడా సుబ్బ
గురుమూర్తి, ఉపాధ్యక్షులు గోళ్ళ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణమండపం అభివృద్ధిలో భాగంగా కమిటీ పిలుపు మేరకు ఈరోజు గోళ్ళ రాజేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఉపాధ్యక్షుల తో పాటు సెక్రటరీలు,కమిటీ సభ్యులందరూ గోళ్ళ రాజే తో కళ్యాణ మండపం అభివృద్ధి,అవసరాల కార్యక్రమాల గురించి ప్రధాన అంశాల గురించి చర్చించారు కమిటీ సభ్యులు. ఈ చర్చలలో భాగంగా కమిటీ సభ్యులు మాట్లాడుతు ఇటీవల కాలంలో కళ్యాణ మండపాలు పేద, మధ్యతరగతి వర్గాలకు శుభకార్యాలు నిర్వహించాలంటే అత్యధిక ధరలకు పలుకుతున్న నేపథ్యంలో పేద మధ్యతరగతి ప్రజలు శుభకార్యాలు నిర్వహించాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్న విషయాన్ని తీసుకోవచ్చారు అదేవిధంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణమండపం వారు కేవలం 6000 రూపాయలకే అతి తక్కువ నామమాత్రపు ఖర్చుకే ప్రజలందరికీ శుభకార్యాలను నిర్వహించుకొనేందుకు అనువుగా అందిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో కళ్యాణ మండపంలో మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేయాల్సి ఉందన్న విషయాన్ని గోళ్ళ రాజేష్ దిష్టికి తీసుకువచ్చారు కమిటీ సభ్యులు ప్రసన్న వెంకటేశ్వర స్వామి,ఆలయంతో పాటు శ్రీ వేంకటేశ్వర కళ్యాణ మండపం అభివృద్ధికి అన్ని విధాల తోడ్పాటు అందిచేందుకు గోళ్ళ రాజేష్ తనవంతు భాధ్యతగా రోజా కుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం తో పాటు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మండపం అభివృద్ధిలో తన సయంగా ఎల్లప్పుడు



తోడ్పాటును అందిస్తానని ఈ సందర్భంగా గోళ్ళ రాజేష్ కమిటీ పెద్దలకు హామీ ఇవ్వడం జరిగింది.
ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మేడం శుబ్బ గురుమూర్తి, ఉపాధ్యక్షులు గొల్ల వెంకటలక్ష్మి, సెక్రటరీలు జీలా శైలజ, ఇటికాల చంద్రమౌళీశ్వర గుప్తా, అమరేష్,వెంకట సాయి కృష్ణ,వెన్నుపూస సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ ఇంప్రూవ్మెంట్ ఎగ్జామ్స్ రిజల్ట్స్ లో నారాయణ విద్యార్థుల ప్రభంజనం.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 18:**రాష్ట్ర ప్రభుత్వం నేడు ప్రకటించిన ఇంటర్మీడియట్ ప్రథమ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో నంద్యాల నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. నంద్యాల జిల్లాలోని నారాయణ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను నంద్యాల నారాయణ జూనియర్ కళాశాల ఏజీఎం అంజన్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ రమేష్ గౌడ్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించేందుకు కృషిచేసిన అధ్యాపక బృందాన్ని సత్కరించారు. ఈ సందర్భంగా ఏజీఎం అంజన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా బోధన సాగిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల ఉన్నతికి నారాయణ జూనియర్ కళాశాల బాటలు వేస్తోందని, క్రమశిక్షణతో కూడిన బోధన అందిస్తున్నామని తెలిపారు. ప్రథమ సంవత్సరం ఇంటర్ లో నంద్యాల జిల్లాలోనే ఎంపీసీ విభాగంలో రుక్సానా దూదేకుల 467 మార్కులతో టౌన్ టాపర్ గా నిలిచింది. అంతేకాక ఎంపీసీలో హారిక తాతిరెడ్డి , అమీనా షేక్ ,దాముని తన్మై, పత్తి రంగా కిషోర్ , తేజ శ్రీ కోట 466, గని లక్ష్మి అక్షయ, వినుకురి సమిన్వి 465 మార్కులు తో పాటు 465 మార్కులు పైగా 8 మంది 460 మార్కులు పైగా 22 మంది400 మార్కులు పైగా 129 మంది విద్యార్థులు సాధించారు జూనియర్ ఎంపీసీ పాస్ పర్సంటేజ్ 95.88. బైపీసీ విభాగంలో అలీనా 451 మార్కులతో జిల్లాలో అత్యధిక మార్కులు సాధించింది. మనుదీప్ కరణం 450, అశ్లేష 449, వెంకట భవిత శ్రీ కుంచపు 448, సుష్మిత పెబ్బేటి 447, సేవిత దాసరి 446, అష్రాఫ్ షేక్ 445 మార్కులు తో పాటు 450మార్కులు పైగా 3 మంది 445 మార్కులు పైగా 11 మంది400 మార్కులు పైగా 37 మంది విద్యార్థులు సాధించారు జూనియర్ బైపీసీ పాస్ పర్సంటేజ్97.14 తో టౌన్ టాప్ గా నిలిచింది . ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్ష ఫలితాల్లో దివ్య శ్రీ 989 మార్కులతో టాపర్ గా నిలిచింది. పిడతల రణధీర్ రెడ్డి987, పూజిషా , శివ ప్రియ, హర్షిత్, ఈశ్వర వరప్రసాద్ 986, మహమ్మద్ ఆఫ్రిది ఖాన్, సాయి హర్షిత 984, కారుణ్య, సాయి జయం ఖలీల్ ఖాజా లకు 982 మార్కులు, సౌమ్య, స్ఫూర్తి పవిత్ర , లక్ష్మీ ప్రసన్న 981, స్పందన, గురు చరణ్980 మార్కులు సాధించారు. 985 మార్కులు పైగా6, 980 మార్కులు పైగా 16 మంది, 950 మార్కులు పైగా 61 మంది, 900 మార్కులు పైగా 125 మంది విద్యార్థులు మార్కులు సాధించారు సీనియర్ ఎంపీసీ పాస్ పర్సంటేజ్ 98.16. సీనియర్ బైపిసి విభాగంలో నసీఫా 991 మార్కులతో టౌన్ టాపర్ గా నిలిచారు. సరయు 989,ఫాతిమా అమ్రిన్ 985, నవనీత్ కళ్యాణ్ 984 ఫైజియా 980 మార్కులు సాధించారు. 990 మార్కులు పైగా 1 రికీ 980కి పైగా 6 మంది, 960కి పైగా 11 మంది, 900లకు పైగా 20 మంది విద్యార్థులు మార్కులు సాధించారు. సీనియర్ బైపిసి పాస్ పర్సంటేజ్ 100% సాధించారు.ఇంటర్మీడియట్ ఫలితాల్లో విజయకేతనం ఎగురవేసిన నంద్యాల నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులను ఉమ్మడి కర్నూలు జిల్లా కోర్ డీన్ లింగేశ్వర్ రెడ్డి, డీజీఎం గోవర్ధన్ రెడ్డి, అకడమిక్ డీన్లు ఆంజనేయ రెడ్డి, విశ్వనాథ రెడ్డి, వెంకటేశ్వర్లు అభినందించగా ఇందుకు కృషి చేసిన ఏజీఎం, ప్రిన్సిపల్ మరియు అధ్యాపక బృందాన్ని అభినందించారు.

# గాజులపల్లిలో వినూత్న ఉద్యాన పంటల సాగుపై కలెక్టర్ పరిశీలన.

**..అధిక ఆదాయాన్ని అందించే హార్టికల్చర్ పంటల వైపు రైతులు మళ్లాలి.**

**..నీటి సంరక్షణకు ఫామ్ పాండ్లు, ఆధునిక సాగు విధానాలను విస్తృతంగా అమలు చేయాలి.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 18:**
జిల్లాలో ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని పెంపొందించడంతో పాటు రైతుల ఆదాయాన్ని అధికం చేసే వినూత్న సాగు విధానాలను ప్రోత్సహించేందుకు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా గురువారం మహానంది మండలం గాజులపల్లి గ్రామంలో పలు ఉద్యాన పంటల తోటలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ అధికారులతో కలిసి రైతులు అనుసరిస్తున్న ఆధునిక సాగు పద్ధతులు, నీటి సంరక్షణ చర్యలు, అంతర పంటల సాగు విధానాలపై వివరాలు తెలుసుకున్నారు.
గ్రామానికి చెందిన రైతు హుస్సేన్ రెడ్డి సాగు చేస్తున్న గులాబీ తోటను కలెక్టర్ పరిశీలించారు. సుమారు నాలుగు ఎకరాల్లో సాగవుతున్న ఈ తోటలో పీఎండీఎస్ మరియు మల్చింగ్ పద్ధతులను అమలు చేయడం ద్వారా నేలలో సేంద్రీయ కార్బన్ శాతం పెరిగి నాణ్యమైన దిగుబడులు సాధిస్తున్నట్లు రైతు వివరించారు. ఈ తోటలో 'అర్కా సవి' అనే కొత్త రకం గులాబీ వెరైటీని సాగు చేయడం విశేషమని ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. అలాగే డ్రిప్ ఇరిగేషన్ విధానంలో బంతి పంట సాగును కూడా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో లబ్ధి పొందిన కమ్యూనిటీ ఫామ్ పాండ్‌ను పరిశీలించారు. సుమారు ఒక కోటి లీటర్ల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం కలిగిన ఈ ఫామ్ పాండ్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.7 లక్షల వరకు సబ్సిడీ అందించినట్లు ఉద్యానశాఖ అధికారులు వివరించారు. నీటి కొరత పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఫామ్ పాండ్లు ఎంతో ఉపయోగకరమని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే అరటి తోటలో అమలు చేస్తున్న మల్టిపుల్ క్రాపింగ్ విధానాన్ని పరిశీలించారు. అరటి, ఆయిల్ పామ్ మరియు పీఎండీఎస్ విధానాల సమ్మేళనంతో అంతర పంటలను సాగు చేస్తూ రైతులు మెరుగైన ఆదాయం పొందుతున్న తీరును తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన రైతులు లక్ష్మయ్య, మురళి సాగు చేస్తున్న తోటలను కూడా కలెక్టర్ సందర్శించారు. అక్కడ మామిడి, అవకాడో, అరటి పంటలను సమ్మిళితంగా సాగు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. అవకాడోలో తొలిసారిగా సాగు చేస్తున్న 'బల్బ్' రకాన్ని పరిశీలించి దాని సాగు అవకాశాలపై కలెక్టర్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా తోటలో పెంచుతున్న మల్బరీ చెట్లను, తినదగిన మల్బరీ పండ్లను కూడా పరిశీలించి రైతుల ప్రయోగాత్మక సాగు విధానాలను అభినందించారు. అదేవిధంగా గాజులపల్లి గ్రామానికి చెందిన రైతు హుస్సేన్ తన పొలంలో చేపడుతున్న యాపిల్ సాగును పరిశీలించిన కలెక్టర్, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా కొత్త పంటలను ప్రయోగాత్మకంగా సాగు చేస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నందుకు ఆయనను కలెక్టర్ అభినందించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాంప్రదాయ పంటలతో పోలిస్తే అధిక ఆదాయం అందించే ఉద్యాన పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో కొత్త రకాల పంటల సాగును ప్రోత్సహిస్తూ రైతులకు అవసరమైన సాంకేతిక సహాయం



అందించాలని ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకుని రైతులు ఫామ్ పాండ్లు ఏర్పాటు చేసుకోవాలని, వాటి ద్వారా అత్యవసర పరిస్థితుల్లో లైఫ్ సేవింగ్ ఇరిగేషన్ అందించి పంటలను సంరక్షించుకోవచ్చని తెలిపారు. జిల్లాలో ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

# రాష్ట్ర ముస్లిం రచయితల సంఘం ప్రధానకార్యదర్శి గా ఎన్నికైన నంద్యాల అబ్దుల్ సమద్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 18:**



రాష్ట్ర ముస్లిం రచయితల సంఘం (రిజిస్టర్ నెం 238/2023)కార్యవర్గ సమావేశంలో నంద్యాల రచయిత షేక్ అబ్దుల్ సమద్ ను ప్రధాన కార్యదర్శి గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముస్లిం రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు ప్రముఖ కవి కరీముల్లా అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధ్యక్షులుగా గుంటూరుకు చెందిన అబ్దుల్ హకీం, ప్రధాన కార్యదర్శిగా నంద్యాలకు చెందిన అబ్దుల్ సమద్, ఉపాధ్యక్షులుగా మండపేటకు చెందిన ముహమ్మద్ షరీఫ్, సహాయం కార్యదర్శిగా ఈవేమనా రఫీ, కోశాధికారిగా బషీర్ అహమ్మద్, మహిళా కార్యదర్శులుగా బషీరున్నిసా బేగం, ఖుర్షీద్ బేగం, నసీమా బేగం, కార్యదర్శులుగా యస్. యం. సుభాని, ఉమర్ ఫారూఖ్ ఖాన్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని కార్యదర్శి అబ్దుల్ సమద్ మాట్లాడుతూ ముస్లిం విద్యాభివృద్ధికి, సామిజక చైతన్యానికి, మతసామరస్యానికి, లౌకిక విలువల పరిరక్షణకు, తెలుగు భాషాభివృద్ధికి, రాజ్యాంగ విలువలు కట్టుబడి "మురసం" పని చేస్తుందని కార్యవర్గం ప్రతిన చేసినట్లు తెలిపారు. ఇప్పటికే పలు జిల్లాల్లో జిల్లా శాఖలు ఉన్నాయని, లేని చోట జిల్లా కన్వీనర్లు, కార్యవర్గ ఎన్నిక నిర్వహించనున్నట్లు సమద్ ప్రకటించారు. వివిధ సందర్భాలను బట్టి కవిసమ్మేళనాలు,కవిత్వం,కథ, వ్యాసాలు పై శిక్షణ తరగతులు, సెమినార్లు నిర్వహిస్తామని తెలిపారు. త్వరలో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అన్ని ప్రగతిశీల, లౌకిక, దళిత, బహుజన సాహితి శిబిరాలకు తమ సంఘీభావం ఉంటుందని , మురసం అన్ని రకాల మతోన్మాదాలను, మత ఉగ్రవాదాలను వ్యతిరేకిస్తుందని, దేశ సమైక్యతకు కృషి చేస్తుదని మురసం భవిష్యత్తు కార్యక్రమాలు ప్రకటించారు. త్వరలో జాతీయ అధ్యక్షులు కరీముల్లా, అధ్యక్షులు అబ్దుల్ హాకీం , ప్రధాన కార్యదర్శులు అన్ని జిల్లాలు ప్రర్యటించనున్నట్లు సమద్ తెలిపారు.

# రెండేళ్ల పాలన ప్రజా విశ్వాసానికి నిదర్శనం.!

**..ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి.**

**..ఆత్మకూరులో ఘనంగా రెండేళ్ల పాలన సభ.. వేలాదిగా తరలివచ్చిన ప్రజానీకం.**

**..సంక్షేమం, అభివృద్ధి రెండు చక్రాలుగా నియోజకవర్గ ప్రగతి.**

**..రెండేళ్లలో రూ. 700 కోట్లతో అభివృద్ధి పనులు.**

**..అభివృద్ధిపై చర్చకు శిల్పా చక్రపాణి రెడ్డికి ఎమ్మెల్యే సవాల్.**

**..శిల్పా వ్యవహార శైలిపై విసుగు చెంది టీడీపీలో చేరిన ఆత్మకూరు ఎంపీపీ, పలువురు మైనార్టీ నేతలు.**










**ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు, జూన్ 18:**
రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుని, సంక్షేమం మరియు అభివృద్ధిలో ప్రజాదరణతో దూసుకుపోతోందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని ఆర్.ఆర్ కన్వెన్షన్ హాల్ నందు గురువారం నిర్వహించిన 'రెండేళ్ల పాలన – సంక్షేమం, అభివృద్ధి' సభ వేలాదిగా తరలివచ్చిన ప్రజల మధ్య అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం గత రెండేళ్లలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందించిందని కొనియాడారు. కేంద్రంలో మోదీ సహకారం, రాష్ట్రంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ల సారథ్యంలో సంక్షేమ పథకాల అమలుతో పాటు రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాదులు పడ్డాయని, పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక వసతుల కల్పన, వ్యవసాయ రంగానికి ప్రోత్సాహం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి కల్పనలో ప్రభుత్వం విశేష ఫలితాలు సాధించిందని వివరించారు. నియోజకవర్గ పరిధిలో గత రెండేళ్లలో రూ. 700 కోట్ల నిధులతో రికార్డు స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సున్నిపెంటలో రూ. 11 కోట్లతో రోడ్ల విస్తరణ, నూతన సీసీ రోడ్ల నిర్మాణం, ప్రధాన రహదారులపై డివైడర్లు, డ్రైనేజీ కాలువలు, వీధి దీపాల ఏర్పాటు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు రూ. 140 కోట్లతో ఇంటింటికీ తాగునీటి సౌకర్యం, మరో రూ. 22 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఆధునికీకరణ. శ్రీశైలం జలాశయం, సిద్ధాపురం ఎత్తిపోతల పథకం, తెలుగుగంగ, కేసీ కెనాల్ వంటి సాగునీటి ప్రాజెక్టులను గాడిలో పెట్టి రైతాంగాన్ని ఆదుకున్నామన్నారు. మహానంది – బోయలకుంట్ల మెట్ట వరకు సుమారు రూ.8కోట్లతో నూతన రహదారి నిర్మాణంతో పాటు బండి ఆత్మకూరు, మహానంది మండలాల్లో నూతన రహదారుల నిర్మాణంతో ప్రజా రవాణాను మెరుగుపరిచామన్నారు, బండి ఆత్మకూరు మండల కేంద్రంలో శ్రీశైలం, మహానంది దేవస్థానాల ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, ప్రభుత్వ కళాశాలలు, కస్తూర్బా గాంధీ పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో మౌలిక వసతుల విస్తరణ. ప్రభుత్వ ఆసుపత్రి, ఆర్టీసీ బస్టాండ్‌లలో మినరల్ వాటర్ ప్లాంట్లు, మెరుగైన వసతుల కల్పన చేస్తున్నామన్నారు.

**శిల్పాకు షాక్.. టీడీపీలో చేరిన ఆత్మకూరు ఎంపీపీ మరియు మైనార్టీ నేతలు**

తమను ప్రజలు చీదరించుకున్నా వైసీపీ నేతలకు ఇంకా బుద్ధి రాలేదని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆ పార్టీ నేతలు ఇప్పటికీ అదే తప్పుడు ప్రచారాలు, అహంకార ధోరణిని అవలంబిస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి దమ్ముంటే నియోజకవర్గ అభివృద్ధిపై ప్రజల ముందే నేరుగా చర్చకు రావాలని సవాల్ విసిరారు. శిల్పా చక్రపాణి రెడ్డి అహంకార, దిగజారుడు తీరుపై విసుగు చెంది ఆత్మకూరు ఎంపీపీ తిరుపలమ్మ పాటు వెంకటాపురం, కరివేన గ్రామాలకు చెందిన సుమారు 150 కుటుంబాలు మైనార్టీ, దళిత కుటుంబాలు ఆ పార్టీని వీడి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి గారు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం పథకాల పట్ల ఆకర్షితులై.. మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అహంకార ధోరణి పట్ల విసుగుచెంది టీడీపీలో చేరుతున్నట్లు ఎంపీపీ తిరుపలమ్మ పేర్కొన్నారు. వెంకటాపురం గ్రామానికి చెందిన మైనార్టీ నేత నజీర్ అహమ్మద్ మాట్లాడుతూ.. ఎన్డీయే కూటమి ప్రభుత్వంతోనే మైనార్టీల సంక్షేమం సాధ్యమని భావించి పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు.

**సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ.**

పేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఒక వరం అని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూరులో జరిగిన రెండేళ్ల పాలన సంక్షేమం అభివృద్ధి కార్యక్రమం అనంతరం నియోజకవర్గ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 51 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 30 లక్షల విలువగల చెక్కులను ఎమ్మెల్యే శ్రీ బుడ్డా రాజశేఖర రెడ్డి గారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ.. సీఎం శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి సహకారంతో పార్టీలకు అతీతంగా సహాయం కోరిన ప్రతి ఒక్కరికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం అందుతుందని అన్నారు